సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 29 । మార్చి । 2024



జగనన్నతోనే సంక్షేమం

సీఎం జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి అన్నారు.

IIIలో



నేత్రపర్వంగా తిరువీధి

సింహాచలం: సింహగిరిపై గురువారం అప్పన్నకు సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి విశేషంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

పాడేరు, అరకు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
పాడేరు, అరకు	6.13	4.38
రంపచోడవరం	6.27	4.43

న్యూస్‌రీల్

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా బోర్ల మరమ్మతులపై దృష్టి సారించాలని స్థానిక ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశించారు. పీవో తన చాంబర్‌లో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ ప్రకారం పనిచేయాలని సూచించారు. రంపచోడవరం ఏజెన్సీ పరిధిలో మొత్తం 3550 చేతి బోర్లు ఉన్నాయన్నారు. వీటిలో పనిచేయని బోర్ల వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఏజెన్సీలోని సత్యసాయి పథకం, జల జీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందుతున్న గ్రామాల వివరాలు తెలుసుకున్నారు. ఎద్దడి ఉన్న చోట సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీఎల్పీవో రాఘవన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజేంద్రబాబు, శివ పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్సు బృందం నెల్లిపాక పీహెచ్‌సీ సందర్శన



పీహెచ్‌సీలో వైద్య సేవల వివరాలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

ఎటపాక: మండలంలోని నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, రోగుల వివరాలను పరిశీలించింది. అనంతరం ఆరోగ్య భద్రతపై గ్రామస్తులకు బృందం సభ్యులు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు హెచ్‌బీ పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సభ్యులు ఎస్‌వో కైలాష్, డీపీవో సతీష్, సీసీ మణికంఠ, పీహెచ్‌సీ వైద్యులు ప్రత్యూష్, విష్ణుప్రియ, పీహెచ్‌ఎన్, ఏఎన్‌ఎంలు సంధ్యారాణి, రమణి, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్ష



సీఎస్ జవహర్ రెడ్డి సమీక్షకు హాజరైన కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా

సాక్షి,పాడేరు: మత్తు పదార్థాల నియంత్రణపై గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి వీడియో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఆయనకు నివేదించారు. దేశించారు.

విస్తృతంగా కూంబింగ్



కూంబింగ్‌లో నిమగ్నమైన ప్రత్యేక పోలీసు బలగాలు

వై.రామవరం: జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాపోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. దీనిలో భాగంగా కూంబింగ్‌ను విస్తృతం చేసింది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాలు తనిఖీలు నిర్వహించాయి. మండల కేంద్రం నుంచి లోతట్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన మార్గంలో వాహనాలు క్షుణ్ణంగా పరిశీలించాయి. అడిషనల్ ఎస్‌ఐ కె.రాంబాబు, సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

రంప టీడీపీలో తలో దారి!

- అరకు పార్లమెంట్ టికెట్ బీజేపీకి కేటాయింపుపై అసంతృప్తి
- ఉనికి లేని పార్టీకి ఎలా కేటాయిస్తారని విమర్శ
- గ్రూపులుగా విడిపోయిన పార్టీ శ్రేణులు
- ప్రచారానికి దూరం
- అసెంబ్లీ అభ్యర్థి విషయంలోనూ ఇదే పరిస్థితి

అరకు పార్లమెంట్ పరిధిలోని రంపచోడవరం నియోజకవర్గంలో టీడీపీ ఉనికి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. క్షుద్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారిన చంద్రబాబు నిర్ణయాలను పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. అరకు పార్లమెంట్ టికెట్ బీజేపీకి కేటాయింపు.. టీడీపీలో సీనియర్లను పక్కనబెట్టి పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి అసెంబ్లీ టికెట్ ఇవ్వడం వంటి పరిణామాలు ఈ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనున్నాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



రంపచోడవరం: రంపచోడవరం నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల పరిస్థితి తలోదారి అన్నట్టుగా ఉంది. అరకు పార్లమెంట్ టికెట్‌ను పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడం వారికి మింగుడు పడటం లేదు. ఏమాత్రం ఉనికి లేని బీజేపీకి టికెట్ ఎలా కేటాయిస్తారని వారు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కూటమి (బీజేపీ) అభ్యర్థి మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు మద్దతుగా టీడీపీ శ్రేణులు ప్రచారం చేసే పరిస్థితులు కనిపించడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ తరపున అరకు ఎంపీగా గెలుపొందిన ఆమె పార్టీకి దూరంగా ఉంటూ స్వప్రయోజనాలకోసం ఐదేళ్ల పదవిని వాడుకున్నారని, నియోజకవర్గంలో ఎన్నడూ కనిపించని ఆమె తరపున ఎలా ప్రచారం చేయాలని వారు మదనపడుతున్నారు. ఆమెపై ఆర్థికపరమైన అంశాలతోపాటు ఎస్టీ కాదని కేసులు ఉన్నాయి. ఇలా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె కోసం ప్రచారం చేయలేమని టీడీపీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు బహిరంగంగానే చెబుతున్నారు. మొదటి నుంచి ఈ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీకి పట్టు ఎక్కువ. పార్టీ ఫిరాయించిన నాటి నుంచి కొత్తపల్లి గీతపై గిరిజనుల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున విజయం సాధించిన వంతల రాజేశ్వరి పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరడాన్ని నియోజకవర్గ ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. 2019 ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పారు. ఇదే పరిస్థితి కొత్తపల్లి గీతకు కూడా తప్పదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

టీడీపీ శ్రేణులు మొరపెట్టుకున్నా..

రంపచోడవరం అసెంబ్లీకి సంబంధించి టీడీపీ అభ్యర్థిని మార్చాలని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి నాయకత్వంలో ఆందోళన చేసినప్పటికీ అధిష్ఠానం నుంచి ఎటువంటి స్పందన లేదు. పార్టీలో సీనియర్లను కాదని మిరియాల శిరీష దేవికి ఎలా **టికెట్ ఇస్తారని, దీనివల్ల నష్టం జరుగుతుందని పార్టీ శ్రేణులు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. నెలరోజుల క్రితం పార్టీలోకి వచ్చిన ఆమెకు పార్టీ టికెట్ ఇవ్వడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు అనుచరులు బహిరంగంగా విమర్శించారు. టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషదేవి భర్త భాస్కర్‌కు సంబంధించిన** కేసుల వివరాలను టీడీపీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు స్వయంగా చంద్రబాబుకు అందజేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించినట్టుగా ఆయనకు వివరించారు. ఈ పరిస్థితుల్లో శిరీషదేవిని అభ్యర్థిగా కొనసాగిస్తే పార్టీకి నష్టం తప్పదని తెలియజేసినా చంద్రబాబు పట్టించుకోలేదని ఆ పార్టీ శ్రేణులు బహిరంగంగా చెబుతున్నాయి.

రెబల్‌గా బరిలోకి?

చంద్రబాబు ఇచ్చిన ఝలక్‌తో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఇంటికే పరిమితమయ్యారు. టీడీపీ తనకు రూ.20 కోట్లు ఆఫర్ ఇచ్చినప్పటికీ వైఎస్సార్‌సీపీని విడిచి వెళ్లేది లేదని అప్పటిలో ప్రకటించిన వంతల రాజేశ్వరి ఆ తరువాత పార్టీ ఫిరాయించడంపై నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉంది. అదే ఆమె ఓటమికి కారణమైంది. అప్పటిలో పార్టీ మారేదిలేదని ఆమె ప్రకటించిన దానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇలా టీడీపీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇలావుండగా ఎన్నికల్లో టీడీపీ రెబల్‌గా పోటీచేయాలా లేదా అనే దానిపై వంతల రాజేశ్వరి అనుచరులతో సమాలోచనలు చేస్తున్నట్టు సమాచారం.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



ఎమ్మెల్సీ అనంతబాబు సమక్షంలో పార్టీలో చేరిన పోతందొరపాలెం టీడీపీ కార్యకర్తలు

గంగవరం: పండ్రప్రోలు పంచాయతీ పోతందొరపాలెం గ్రామానికి చెందిన 40 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం సాయంత్రం మండలంలో మోహనాపురం, పండ్రప్రోలు, మర్రిపాలెం, జడేరు పంచాయతీల్లో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) ఎన్నికల ప్రచారంలో వారంతా కలిసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తాము రామన్నదొర, శారపు బాపూజీ, ఎస్.రాజబాబుల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు తాటి పండుదొర, తాము లక్ష్మి నాయకత్వంలో చేరిన వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

రూ.10.13 కోట్లకు అప్పన్న తలనీలాల వేలం

సింహాచలం: సింహాచలం దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాలకు గురువారం వేలం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి గాను రూ.10 కోట్ల 13 లక్షల ఆదాయం లభించింది. తమిళనాడుకు చెందిన దొరై ఎంటర్‌ప్రైజెస్ హెచ్చుమొత్తానికి వేలం సొంతం చేసుకుంది. సీల్డ్ టెండర్లు 8 మంది దాఖలు చేయగా అందులో కూడా దొరై ఎంటర్‌ప్రైజస్ 9కోట్ల 61లక్షల 40వేల హెచ్చుమొత్తానికి కోడ్ చేసింది. అలాగే ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా గరుడ ఎంటర్‌ప్రైజస్ 8కోట్ల 28లక్షల 99వేల 999 కోడ్ చేసింది. బహిరంగ వేలం ద్వారా వచ్చిన రూ.10 కోట్ల 13లక్షలు హెచ్చుపాటని ఖరారు చేశారు.

ఎన్నికల విధులపై సమగ్ర శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత



హాజరైన మాస్టర్ ట్రైనీలు

కలెక్టర్ విజయ సునీత

సాక్షి, పాడేరు: సార్వత్రిక ఎన్నికల అధికారులు, సిబ్బందికి ప్రతి అంశంపైన సమగ్ర శిక్షణ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనకు అన్ని విషయాలు తెలుసు అనే భావనను పక్కనబెట్టి, ప్రతీ చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఆదేశాలు, నిభందనలు, సూచనలు, మార్పులు, చేర్పులను గమనిస్తూనే వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా సిబ్బందిలో సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. సమాచార సేకరణలో అలసత్వం, జాప్యం ఉండకూడదన్నారు. ఈవీఎంల వినియోగంలో చిన్నపొరపాటు కూడా జరగరాదని, ఒకవేళ జరిగిన వాటిని సరిదిద్దుకునే అంశాలపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత నాలుగు రకాల సీళ్లు వేయాలని ఆదేశించారు. పోలింగ్‌లో పాల్గొనే ఓటర్ల సంఖ్య, మెషీన్ మీద చూపించిన నంబర్, పీవో డైరీలో నంబర్, ఓటింగ్ స్లిప్పులు, తదితర ఐదు రకాల నంబర్లు ఒకేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పాడేరు, అరకులోయ ఆర్వోలు భావన, వి.అభిషేక్, డీఆర్వో పద్మావతి పాల్గొన్నారు.

ఉన్నత చదువుల్లో రాణించాలి



మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: గిరిజన విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలని స్థానిక ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు, వచ్చేనెల 7న జరగనున్న కాలేజీ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో గుత్తులపుట్టు, దిగువమెదాపుట్టు ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక బోధన తరగతుల నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే పోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుల్లో రాణించి ఉన్నత స్థానంలో స్థిరపడినప్పుడు కుటుంబం, గ్రామం, ఉపాధ్యాయులు ఎంతో సంతోషిస్తారన్నారు. డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో రజని, హెచ్‌ఎంలు సింహాచలం, గంగాభవాని, మంజుల, రీమలి జాన్ పాల్గొన్నారు.

అసెంబ్లీ సీటు బీజేపీకి ఎలా కేటాయిస్తారు?

అరకు టీడీపీ ప్రకటిత అభ్యర్థి సియారి దొన్నుదొర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సియారి దొన్నుదొర

అరకులోయ టౌన్: చంద్రబాబు, లోకేష్ తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా అరకు అసెంబ్లీ సీటును బీజేపీకి ఎలా కేటాయిస్తారని టీడీపీ ప్రకటించిన అరకు అసెంబ్లీ అభ్యర్థి సియారి దొన్నుదొర ప్రశ్నించారు. గురువారం తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. బుధవారం వివిధ మాధ్యమాల ద్వారా అరకు అసెంబ్లీ టికెట్ బీజేపీకి చెందిన పాంగి రాజారావుకు కేటాయించినట్టు తెలుసుకున్నానన్నారు. దీనిపై చంద్రబాబును ఫోన్లో సంప్రదించేందుకు ప్రయత్నిస్తే స్పందించలేదన్నారు. వెంటనే టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి డి.సత్యను సంప్రదించగా అధిష్ఠానంతో చర్చిస్తామని తెలిపారన్నారు. గురువారం ఉదయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడును ఫోన్లో సంప్రదించగా బీజేపీ ఏకపక్షంగా జాబితా విడుదల చేసినట్టు ఆయన చెప్పారన్నారు. మీరే అరకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉంటారని తెలిపారన్నారు. జనవరి 20న అరకులో జరిగిన రా కదలిరా బహిరంగ సభలో వేలాది మంది పార్టీ శ్రేణుల సమక్షంలో అరకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి దొన్నుదొరను గెలిపించాలని చంద్రబాబు కోరారని, ఫిబ్రవరి 24న టీడీపీ విడుదల చేసిన మొదటి జాబితాలో తన పేరు ప్రకటించారన్నారు. ఇప్పుడు కూటమి అభ్యర్థిగా పాంగి రాజారావు పేరును ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు బలరాం, తులసీరావు, రాజుబాబు, ఎస్. మణి మాట్లాడుతూ పాంగి రాజారావుకు టికెట్ ఇస్తే ఓటమి ఖాయమన్నారు.

గిరి రైతులకు అండగా కలెక్షన్ సెంటర్లు

- తొమ్మిది మండలాల్లో ఏర్పాటు
- ఒకొక్కదానికి రూ.15 లక్షలు
- అటవీ ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు వీలుగా సౌకర్యం



అనంతగిరిలో నిర్మించిన కలెక్షన్ సెంటర్ భవనం

అనంతగిరి: గిరి రైతులకు అండగా ప్రభుత్వం సేవ లందిస్తోంది. వారు సేకరించిన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రాని సందర్భంలో నిల్వ చేసుకునేందుకు వీలుగా ఉద్యానవనశాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సౌకర్యాలకు కల్పనకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా పాడేరు డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఒకొక్క భవనానికి రూ.15 లక్షలు వెచ్చించింది. మండల కేంద్రాలైన అనంతగిరి, అరకువేలీ, డుంబ్రిగుడ, హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. పాడేరు, జీకేవీధిలో స్థల సమస్య కారణంగా భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. కలెక్షన్ సెంటర్ పరిధిలో ఏర్పాటయ్యే రైతు ఉత్పత్తిదారుల సంఘం పరిధిలో రెండు వేల మంది సభ్యులుగా ఉన్నారు. గ్రూపునకు పది మంది చొప్పున రైతులు ఉంటారని అధికారవర్గాలు తెలిపాయి. దీనివల్ల అటవీ ఉత్పత్తులకు గిట్టుబాట ధర లేనప్పుడు ఆందోళన చెందనవరం లేదు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా అటవీ ఉత్పత్తులను కలెక్షన్ సెంటర్లలో ఉంచుకుని, గిట్టుబాట ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చని అధికారవర్గాలు తెలిపాయి.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు



మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు

పాడేరు (హుకుంపేట): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. గురువారం పాత పాడేరులో ఎన్నికల పరిశీలకులు శ్రీకాంత్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో జగనన్న గిరిజనుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. అదే విషయాన్ని ప్రజలకు వివరించి మద్దతు కోరాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారంపైన దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల పరిశీలకుడు శ్రీకాంత్‌రాజు మాట్లాడుతూ మండలంలోని 26 పంచాయతీలను ఆరు సెక్టార్లుగా విభజించామన్నారు. ఒక సెక్టార్‌కు ఐదు నుంచి ఆరు పంచాయతీలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, బూత్, సచివాలయ కన్వీనర్లు కీలకపాత్ర పోషిస్తారన్నారు. పంచాయతీ నుంచి ఇద్దరు లేదా ముగ్గురిని సెక్టార్ ఇన్‌చార్జిలుగా నియమించనున్నట్టు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గతంలో మాదిరిగా పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఐదేళ్లలో పాడేరు నియోజకవర్గంలో రూ.1300 కోట్లతో అభివృద్ధి చేపట్టామన్నారు. ఈవిషయాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి, మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, ఏఎంసీ చైర్మన్ సూరిబాబు, పార్టీ జోనల్ ఇన్‌చార్జి కే.విశ్వ, మాజీ ఎంపీపీ రమణమూర్తి,సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎగసిన మంటలు.. ఐదిళ్లు దగ్ధం

- నగదు, బంగారం, ధాన్యం, సర్టిఫికెట్లు బూడిద
- నిరాశ్రయులైన ఏడు కుటుంబాలు
- పరామర్శించిన చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య
- మల్లెతోటలో ఘటన



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇళ్లు



బాధితులతో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య



బోరున విలపిస్తున్న బాధిత కుటుంబాలు



మంటలు ఆర్పేందుకు నీటిని అందిస్తున్న విద్యార్థులు

చింతూరు: ఆకస్మాత్తుగా చెలరేగిన మంటలు క్షణాల్లో ఐదు ఇళ్లను బుగ్గిపాలు చేసి, ఏడు కుటంబాలను నిరాశ్రయులను చేశాయి. సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం ఉంటుందని స్థానికులు తెలిపారు. మండలంలోని మల్లెతోటలో గురువారం కాక శిరమయ్య ఇంట్లో మంటలు ఒక్కసారిగా చెలరేగి పక్క ఇళ్లకు వ్యాపించాయి. శిరమయ్య కుటుంబ సభ్యులు శుభకార్యం నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లారు. కుమార్తె లలిత కూలికి వెళ్లొచ్చి ఇంట్లో నిద్రిస్తోంది. అదే సమయంలో మంటలు చెలరేగడంతో ఆమె వెంటనే భయటకు వచ్చి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసింది. స్థానికులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నిస్తుండగా శిరమయ్య ఇంట్లోని రెండు గ్యాస్ సిలిండర్లు ఒక్కసారిగా పేలడంతో మంటలు మరింత ఎగిశాయి. పక్కనే ఉన్న కాక ప్రసాద్, కాక సీతమ్మ, గొర్రె పిచ్చయ్య, ముచ్చిక బిగ్‌బాస్ ఇళ్లతో పాటు రెండు మేకల పాకలకు వ్యాపించడంతో బూడిదయ్యాయి. ఆ ఇళ్లల్లోని మరో మూడు గ్యాస్ సిలిండర్లు కూడా పేలినట్టు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో కాక శిరమయ్య, ప్రసాద్ ఇళ్లలోని రూ.30 వేల నగదు, రూ.లక్ష విలువైన బంగారం, 30 బస్తాల ధాన్యం, డిగ్రీ సర్టిఫికెట్లు, దుస్తులు, వంటపాత్రలు, ఇంటి సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో బాధితులు బోరున విలపిస్తున్నారు. మంటలను స్థానికులు అదుపుచేయగా కోతులగుట్ట నుంచి వచ్చిన అగ్నిమాపక వాహనం మిగిలిన మంటలను అదుపు చేసింది.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ఘటన జరిగిన ప్రాంతం పక్కనే గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఉంది. మంటలు చెలరేగిన సమయంలో పాఠశాలలో 110 విద్యార్థులు, ఉపాధ్యాయులున్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మధ్యలో ప్రహరీ అడ్డుగా ఉండటంతో విద్యార్థులకు ప్రమాదం తప్పినట్టయింది. మంటలు అదుపులో స్థానికులకు విద్యార్థులు సాయపడ్డారు.

అన్ని విధాలుగా ఆదుకుంటాం: చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

అగ్ని ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానిక ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఘటన వివరాలను తెలుసుకున్నారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని తహసీల్దార్ నజీముల్లాషాను ఆదేశించారు. బాధితులకు వెంటనే టార్పాలిన్లు, దుప్పట్లు అందించాలని సూచించారు. ఐటీడీఏ తరఫున ఆర్థికసాయం అందించడంతో పాటు అన్ని విధాలా ఆదుకుంటామని బాధితులకు పీవో భరోసానిచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలకు బియ్యం, మంచినూనె, కందిపప్పును రెవెన్యూ సిబ్బంది అందించారు. బాధిత కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. విషయాన్ని ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, మురళి, విప్లవ్ కుమార్, రాజు పాల్గొన్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ పరామర్శించి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

రైతులకు అండగా ప్రభుత్వం



కలెక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీహెచ్‌వో రమేష్

ముంచంగిపుట్టు: రైతులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో డీఆర్‌డీఏ, ఉద్యానవనశాఖ సహకారంతో అటవీ ఉత్పత్తులను భద్రపరచుకునేందుకు కలెక్షన్ సెంటర్లు నిర్మాణం చేపట్టామని డీహెచ్‌వో రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన గురువారం పర్యటించి, సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. గిరిజన రైతులు అటవీ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలో అమ్ముకునేందుకు వీలుగా కలెక్షన్ సెంటర్లు ఉపయోగపడతాయన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా వీటిని ఉపయోగించుకుని, అటవీ ఉత్పత్తులను భద్రపరచుకుని, గిట్టుబాటు ధరతో విక్రయించుకోవచ్చునని, మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు. ఏపీఎం దేవమంగ తదితరులు పాల్గొన్నారు.

పేదలు, మధ్య తరగతి ప్రజలు కోరుకునేది చక్కటి విద్య, మెరుగైన వైద్య సేవలు. తాము ఓటు వేసి గెలిపించిన ప్రభుత్వాలు ఆ రెండూ అందించాలని వారు ఆశిస్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారి ఆకాంక్షలు నెరవేరాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్పత్రులను నవీకరించింది. వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టింది. ఇందుకు ఎంత ఖర్చయినా వెనుకడుగు వేయలేదు. ఈ చర్యలతో ఎంతటి ఖరీదైన వైద్యం అయినా పేదలకు అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు పేదవాడు నిర్భీతిగా ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చక్కటి వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికొస్తున్నాడు. ప్రభుత్వం అంటే ఇలా ఉండాలని జగనన్న సర్కార్‌ను వేనోళ్ల కీర్తిస్తున్నాడు.

ప్రజారోగ్యానికి జవసత్వాలు

- పేదల కోసం ప్రభుత్వ ఆస్పత్రుల ప్రక్షాళన
- పెద్ద ఎత్తున వైద్యులు, టెక్నీషియన్ పోస్టుల భర్తీ
- అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు

మహారాణిపేట(విశాఖ) : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ), ఆస్పత్రి సేవా కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), బోధనాస్పత్రులైన కేజీహెచ్, ఘోషాస్పత్రి (వీజీహెచ్), ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఈఎన్‌టీ ఆస్పత్రి, మానసిక వైద్యశాల, అంటురోగుల చికిత్స కేంద్రం (టీబీ)లో అవసరమైన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారా మెడికల్ సిబ్బందిని భర్తీ చేసింది. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు సంతృప్తిగా తిరిగి వెళ్లాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా పోస్టుల భర్తీ జరిగింది.

కేజీహెచ్‌లో రెండో క్యాజువాలిటీ

ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా వాసులకు కూడా పెద్ద దిక్కుగా పేరుగాంచిన కేజీహెచ్ క్యాజువాలిటీలో పడకలు సరిపోవడం లేదు. దీంతో మరో క్యాజువాలిటీ నిర్మించి పేద రోగులకు వైద్య సేవలందించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రెండో క్యాజువాలిటీ కోసం మొత్తం రూ. 30 లక్షలు వెచ్చించారు. ప్రస్తుతం ఉన్న క్యాజువాలిటీ పక్కనే 15 పడకలతో రెండో క్యాజువాలిటీని ఆధునాతన వైద్య పరికరాలతో నిర్మించి వినియోగంలో తీసుకొచ్చారు.

నూతన సిబ్బంది నియామకం

కేజీహెచ్‌లో ల్యాబ్, మొబైల్ ఎక్స్‌రే యూనిట్, ఆల్ట్రా స్కానింగ్ వైద్య పరికరాలు సమకూర్చి కొత్త సిబ్బందిని నియమించారు. కోవిడ్ సమయంలో 240 మంది స్టాఫ్ నర్సులు, 25 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 41 మంది ఇతర సిబ్బందిని నియమించారు. అలాగే సాయంత్రం ఓపీలు, వివిధ వైద్య పరికరాల వినియోగం, మరింత మెరుగైన సేవలందించేందుకు మళ్లీ రిక్రూట్‌మెంట్ చేపట్టారు. 361 మంది స్టాఫ్ నర్సులు, 25 మంది ఎనస్తీషియన్లు, 6 రేడియోగ్రాఫర్ పోస్టులు భర్తీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్లు పారామెడికల్ తదితర 343 పోస్టులను పలు దశల్లో భర్తీ చేశారు.



కేజీహెచ్ ప్రధాన మార్గం

టీడీపీ హయాంలో 'నో రిక్రూట్‌మెంట్..'

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎక్కడా పోస్టుల భర్తీ జరగలేదని అధికారులు తెలిపారు. ఉద్యోగంలో ఉండి వివిధ కారణాలతో చనిపోయిన వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం కూడా కష్టంగా ఉండేదంటున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పారా మెడికల్ పోస్టులతో పాటు వైద్యుల పోస్టులు కూడా భర్తీ చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీతో పాటు ఇతర అనుబంధ బోధానాస్పత్రుల్లో 220 పోస్టులు భర్తీ చేశారు. కొంత్యాంలో ఆయుర్వేద ఫార్మసీ అండ్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. విమ్స్‌లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వీటిలో పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు తయారు చేశారు.

పట్టణ పరిధిలో కూడా..

జీవీఎంసీ పరిధిలో ఆధునీకీకరించిన 63 డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీలు) వైద్యులు, పారా మెడికల్, ఇతర సిబ్బందిని నియమించారు. ఇక్కడికి వచ్చే రోగులను పరీక్షించడానికి ఒక ఎంబీబీఎస్ వైద్యుడు నిత్యం అందుబాటులో ఉండేలా, ప్రతిరోజు ఒక స్పెషలిస్టు డాక్టర్ వచ్చి సేవలందించేలా ప్రోగ్రాం చార్ట్ డిజైన్ చేశారు. ఇందుకోసం 60 వైద్య పోస్టులు కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేశారు. 120 మందికి పైగా ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులను నియమించారు.

104/108 వాహనాల్లో కూడా..

గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన 104, 108 వాహనాలను ఇప్పుడు అన్ని ప్రాంతాలకు విస్తరించారు. సత్వర వైద్య సేవల కోసం 40 కొత్త 104 వాహనాలు, 30 నూతన 108 వాహనాలు విశాఖకు కేటాయించారు. వీటికి అవసరమైన సిబ్బంది నియామకం కూడా చేపట్టారు. తాత్కాలికంగా సేవలందిస్తున్న వారిని రెగ్యులర్ చేయడంతో సుమారు 30 మంది కొత్తవారికి ఉపాధి లభించింది.

భారీ ఎత్తున నియామకాలు



రోగులకు సత్వరం నాణ్యమైన సేవలందించాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున పోస్టులు భర్తీ చేసింది. అన్ని యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో కూడా వైద్యులను నియమించింది. అవసరమైన మేరకు పారా మెడికల్ సిబ్బంది నియామకాలు కూడా జరిగాయి. పేదలు వైద్య సేవలు పొందే విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

పోస్టులు భర్తీ చేశాం



పేద రోగులకు కేజీహెచ్‌లో చక్కటి సేవలు అందించగలుగుతున్నాం. రోగులకు అందజేసే సేవల్లో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని ప్రభుత్వ అనుమతితో అనేక పోస్టులు భర్తీ చేశాం. ఆస్పత్రిలో అన్ని వేళల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం వల్ల రోగులకు చక్కటి సేవలందించగలుగుతున్నాం.

– డాక్టర్ పి.అశోక్‌కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

పేదోడి సంక్షేమానికి పెద్దపీట

- రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నే సీఎం
- అతి సమస్యాత్మక ప్రాంతాల్లో ఎమ్మెల్సీ అనంతబాబు ప్రచారం

గంగవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని అతి లోతట్టు సమస్యాత్మకమైన మోహనాపురం, పంద్రప్రోలు, మర్రిపాలెం, జడేరు పంచాయతీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రంపచోడవరం ఎమ్మెల్యేగా మరోసారి నాగులపల్లి ధనలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వివిధ కూడలి ప్రాంతాల్లో అనంతబాబు ప్రసంగించారు. ఐదేళ్లలో జగనన్న అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గంగవరం మండలంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.135 కోట్లు నేరుగా వేశారన్నారు. ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా మారుమూల, లోతట్టు ప్రాంతాల్లో సైతం ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో రంపచోడవరం చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో ధనలక్ష్మిని గెలిపించారన్నారు. అదే స్ఫూర్తితో ఉత్సాహంతో ఈ దఫా ఎన్నికల్లో ఆమెను ఎమ్మెల్యేగా, అరకు పార్లమెంటు అభ్యర్థి తనూజరాణిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీ రత్నం, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు కేఎస్ ప్రభాకర్, పార్టీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శులు ఏడుకొండలు, బాబి, సర్పంచ్‌లు కురసం అక్కమ్మ, కామరాజు రామలక్ష్మి, వెంకటేశ్వర్లదొర పాల్గొన్నారు.



మోహనాపురం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు)

ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమమే లక్ష్యం

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమమే లక్ష్యంగా ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ ఉద్యోగులంతా సమష్టిగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. స్థానిక సుండ్రుపుట్టు ప్రాథమిక పాఠశాలలో పాడేరు డివిజన్‌లోని 11 మండలాలకు చెందిన హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌పై గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్య, కనీస మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలను ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది గుర్తించి పాఠశాలల్లో చేర్పించడమే కాకుండా నాణ్యమైన విద్యాబోధనకు కృషి చేయాలన్నారు. దివ్యాంగ చిన్నారుల పనుల్లో కూడా సహాయపడి, వారి పనులు వారే చేసుకునేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. సదరం ధ్రువపత్రాల మంజూరు, పింఛన్లు, పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందే రాయితీలు, రుణాల పంపిణీపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



హెచ్‌ఎంలు,ఐసీడీఎస్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

న్యాయ విజ్ఞాన సదస్సులతో
సమస్యల పరిష్కారం

పాడేరు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.ప్రదీప మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలపై న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి కమిటీలు ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రభుత్వ జీవోలు, చట్టాలకు అనుగుణంగా కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, లీగల్ అడ్వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రదీప

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు, గుల్లిపాడు రైల్వే స్టేషన్ మధ్య గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందినట్లు తుని రైల్వే ఎస్‌ఐ అబ్దుల్‌మారూఫ్ గురువారం తెలిపారు. విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళ్లే రైలు నుంచి మధ్యాహ్నం జారిపడినట్టు పేర్కొన్నారు. మృతుడు సుమారు 45 సంవత్సరాల వయసు కలిగి, తెలుపురంగు చొక్కా, ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని తుని రైల్వే ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మనసున్న మారాజు



తుపానుకు ఫిషింగ్ హార్బర్‌లో మునిగిపోయిన బోటు(ఫైల్)

- టీడీపీ హయాంలో మునిగిన, కాలిన బోట్లకు సాయం
- ఇలాంటి 36 బోట్లకు రూ.1.35 కోట్ల పరిహారం
- ఈనెల 16న నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఈసీ నుంచి అనుమతి రాగానే పంపిణీకి సన్నద్ధం
- సీఎం జగన్ రుణం తీర్చుకుంటామంటున్న మత్స్యకారులు



సాక్షి, విశాఖపట్నం : మత్స్యకారులపై మమకారంతో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి పట్ల మరోసారి ఉదారతను చాటుకున్నారు. ఇప్పటికే మత్స్యకారుల సంక్షేమానికి పలు పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల భృతి, లీటర్‌పై రూ.9 డీజిల్ సబ్సిడీ, 50 ఏళ్లకే పెన్షను, వేట సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల పరిహారం వంటి పలు ప్రయోజనాలను చేకూరుస్తున్నారు. వారికి ఏ కష్టం వచ్చినా వెంటనే ఆదుకుంటున్నారు. గత నవంబర్ 19 అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 49 బోట్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. బాధిత బోటు యజమానులకు మూడు రోజుల్లోనే భారీ మొత్తంలో రూ.7.11 కోట్ల పరిహారాన్ని అందజేశారు. ఈ బోట్లపై ఆధారపడ్డ కలాసీలు 400 మంది జీవనోపాధి కోసం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఊహించిన దానికంటే ఎక్కువ పరిహారాన్ని అందించడంపై బాధిత మత్స్యకారులు ఎంతగానో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తమకు ఈ మేళ్లన్నీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే జరుగుతున్నాయన్న ఆనందంలో ఉన్నారు.


మత్స్యకారులపై మమకారం

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో సముద్రంలో మత్స్యకారుల బోట్లు కాలిపోయినా, మునిగిపోయినా, తుపాన్లలో దెబ్బతిన్నా పరిహారం సక్రమంగా ఇచ్చేవారు కాదు. ఇచ్చే అరకొర సాయం కూడా ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందుకు భిన్నంగా మత్స్యకారులపై అభిమానాన్ని చాటుకుంటున్నారు. వారికొచ్చే కష్టాలపై తక్షణమే స్పందించి ఉదారంగా సాయమందిస్తున్నారు. టీడీపీ హయాంలో మునిగిన, అగ్ని ప్రమాదానికి గురైన, తుపాన్లలో దెబ్బతిన్న బోట్లకు కూడా పరిహారం అందించేలా చూడాలని బాధిత మత్స్యకారులు తాజా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కోరారు. దీనిపై ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం బాధిత మత్స్యకారులకు పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వివిధ ప్రమాద ఘటనల్లో దెబ్బతిన్న 36 బోట్లకు రూ.1.35 కోట్ల నిధులు విడుదల చేస్తూ మత్స్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ నిధులు జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో జమయ్యాయి.

దెబ్బతిన్న బోట్లు

2014–2019 మధ్య కాలంలో మొత్తం 36 బోట్లు దెబ్బతిన్నాయి. వీటిలో 21 బోట్లు సముద్రంలో మునిగిపోగా, నాలుగు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఐదు నీటి అడుగున చిక్కుకుపోయాయి. మరో ఆరు బోట్లు ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదాల పాలై పాక్షికంగా నష్టం వాటిల్లింది. ఇందులో 2014 హుద్‌హుద్ తుపానుకు మునిగిపోయిన రెండు బోట్లకు, 2018 తిత్లీ తుపానులో మునిగిన మూడు బోట్లకు, 2019 పెథాయ్, జావద్ తుపాన్లకు మునిగిపోయిన 11 బోట్లకు టీడీపీ ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. అప్పుడెప్పుడో టీడీపీ హయాంలో దెబ్బతిన్న బోట్లకు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాయమందిస్తుండడంపై మనసున్న మారాజు అంటూ సీఎం జగన్‌ను మత్స్యకారులు కొనియాడుతున్నారు. ఆయన రుణం తీర్చుకుంటామని పేర్కొంటున్నారు.

ఈసీ స్క్రీనింగ్ కమిటీకి లేఖ



గతంలో ప్రమాదాలకు గురైన బోట్ల యజమానులకు పరిహారం సొమ్ము పంపిణీకి అనుమతించాలని కోరుతూ ఎన్నికల కమిషన్ స్క్రీనింగ్ కమిటీకి లేఖ రాశాం. అటు నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే చెల్లింపులు జరుగుతాయి. టీడీపీ హయాంలో ఈ బోట్లకు పరిహారం కోసం ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి నిధుల విడుదలకు జీవో జారీ చేశారు. సీఎం జగన్ ఉదారతకు కృతజ్ఞతగా మత్స్యకారులు ఆయనకు అండగా ఉంటామని చెబుతున్నారు.

– వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ

మార్మోగిన వేదమంత్రాలు

- పులకించిన సింహగిరి
- శాస్త్రోక్తంగా రెండవ రోజు సుదర్శన నారసింహ మహా యజ్ఞం
- పాల్గొన్న దేవదాయశాఖ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్

సింహాచలం: సింహగిరిపై శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞం రెండవ రోజు గురువారం వైభవంగా కొనసాగింది. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం కూడా కలసి రావడంతో యజ్ఞంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. వేదమంత్రాలతో సింహగిరి పులకరించింది. ఉదయం స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఓ పల్లకీలో, చక్రపెరుమాళ్‌ను ఓ పల్లకీలో అధిష్టింపజేసి ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న యజ్ఞశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ను ఓ వేదికపై, మరొక వేదికపై స్వామి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. వేద మంత్రోచ్ఛరణలు పఠిస్తూ యజ్ఞాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులకు అందజేశారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రబంధం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకాలను వైదికులు పారాయణం చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు దేవస్థానం తరఫున శాలువా, రవిక, కల్యాణం లడ్డూ, పులిహోర ప్రసాదం, అప్పన్న స్వామి రాగి ప్రతిమ అందజేశారు. ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పించారు. యజ్ఞం తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మహాయజ్ఞంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. దేవస్థానం తరఫున ఈవో వారికి స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.



యజ్ఞాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు